ప్రజాశక్తి

గురువారం 1 జనవరి 2026

అల్లూరి సీతారామరాజు

పోలవరం

మాట్లాడుతున్న సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ఉత్సాహంగా ఆరంభం

- సిఐటియు అఖిల భారత మహాసభతో కార్మికోత్తేజం
- దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరు
- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు పిలుపు
- ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి
- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై తీర్మానం

మహాసభకు హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు సిఐటియు 18వ అఖిల భారత మహాసభ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత సంఘం అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎత్తరా ఎర్రెర్రని జెండా అంటూ ఎర్ర జెండా ఔన్నత్యాన్ని చాటి చెబుతూ ప్రజానాట్య మండలి కళాకారులు గీతాన్ని ఆలపించారు. అనంతరం ప్రతినిధులంతా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రతినిధులతో మహాసభ ప్రాంగణం సందడిగా మారింది. అనకాపల్లి జిల్లా కేడీ పేటలోని అల్లూరి సమాధి నుంచి బయలుదేరిన అల్లూరి సీతారామరాజు స్మారక జ్యోతి, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి ప్రారంభమైన వీర గున్నమ్మ విప్లవ జ్యోతి, నెల్లూరు జిల్లా నుంచి కె.పెంచలయ్య విప్లవ జ్యోతి సభా ప్రాంగణానికి రాగా సిఐటియు అఖిల భారత నాయకులు వాటిని స్వీకరించారు.

మహనీయులను తలచుకుంటూ..

మహాసభ జరిగే హాలుకు బాలుదేవ ఆచార్య, లారెన్స్ వేదికగా నామకరణం చేయగా, ప్రాంగణానికి అనతలవట్టం అనందన్ నగర్‌గా పేరుపెట్టారు. ఇలా ఆ మహనీయులను ఈ మహాసభ స్మరించుకుంది. సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మహాసభ స్వాగతోపన్యాసం చేశారు. 'సేవ్ వైజాగ్ – సేవ్ స్టీల్‌ప్లాంట్' నినాదంతో ఆయన తన ప్రసంగాన్ని ఆరంభించారు. సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌ను, ప్రపంచ కార్మిక సంఘాల (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్‌ను వేదికపైకి స్వాగతించారు. ఈ సందర్భంగా కిరిట్సిస్ అంతర్జాతీయ సంఘీభావాన్ని సభా వేదికపై వెల్లడించారు. ప్రపంచ కార్మిక సదస్సు 2026 మే19న కొలోంబోలో జరుగుతుందని, కార్మిక వర్గం, రైతాంగం భారతదేశంలో సాగిస్తున్న ఐక్య ఉద్యమాలను అక్కడ ప్రస్తావించడం జరుగుతుందని అన్నారు. సిఐటియు పోరాటాల్లో ఎప్పుడూ ఒంటరిగా ఉండదని కొనియాడారు.

సభా వేదికపై ఐఎన్‌టియుసి అఖిల భారత కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, హెచ్‌ఎంఎస్ నాయకులు సుదర్శన్‌రావు, ఎఐసిసిటియు ఉపాధ్యక్షులు క్లిఫ్టన్ డి రోజారియో, ఎఐయుటియుసి అఖిలభారత కార్యదర్శివర్గ సభ్యుడు జయసేన్ మెహర్, యుటియుసి ఆఫీస్ బేరర్ షెకిజార్ అపసామి, ఎస్‌ఇడబ్ల్యుఎ ఉపాధ్యక్షురాలు సోనియా జార్జ్, సహా పలు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు హాజరై మహాసభలో సౌహార్ద్ర సందేశాలిచ్చారు. సిఐటియు చేస్తున్న క్రమశిక్షణాయుత, సమరశీల పోరాటాలను పలు సంఘాల నేతలు కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు, కార్మికవర్గ హక్కులను ముందుకు తీసుకెళ్లేందుకు సిఐటియు మరింత కృషి చేస్తుందని వెల్లడించారు.

తీర్మానాలివీ..

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్)ను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని సిఐటియు జాతీయ మహాసభ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు 'ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించండి.. కార్మికులను, ప్రభుత్వ రంగాన్ని కాపాడండి' అంటూ తీర్మానాన్ని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టారు. సభ దీన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మహాసభలో తీర్మానం చేశారు.

కొత్త జిల్లాతో గిరిజనులకు మరిన్ని సేవలు

- పోలవరం ఏర్పాటుపై ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ దినేష్‌కుమార్
- కలెక్టర్ కార్యాలయం ప్రారంభం
- జిల్లా ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే శిరీషాదేవి
- ఎస్పీగా అమిత్‌బర్దర్ బాధ్యతల స్వీకరణ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పోలవరం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అమిత్‌బర్దర్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీ ప్రజలకు మరిన్ని ప్రభుత్వ సేవలందించేందుకు, ప్రజా శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం పోలవరం జిల్లా ఏర్పాటు చేయడం జరిగిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. బుధవారం రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా జిల్లా కలెక్టర్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీషాదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి, రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ శ్రీనివాసరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ పోలవరం జిల్లా రంపచోడవరం నూతన ఇన్‌చార్జి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్,అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, మైనార్టీ బోర్డ్ డైరెక్టర్ షేక్ సుభాని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో వెనుకబడిన ప్రాంతంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌లో గిరిజనులు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు రావాలంటే సుమారు 250 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేదని చాలా ఇబ్బందులు పడేవారని ఇక నుండి రంపచోడవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే ప్రభుత్వసేవలు అందించడం జరుగుతుందన్నారు. నూతన జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం, పోలీస్ కార్యాలయం, వైటిసి, పిఎంఆర్‌సి నుండి సేవలందించే విధంగా ఈ రెండు భవనాలను ప్రస్తుతం ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఐటిడిఎ, సబ్ కలెక్టర్ కార్యాలయాలు యధావిధిగా పనిచేస్తాయని తెలిపారు. గుర్తేడు మండలాన్ని కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పలు ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల పోరాట ఫలితంగానే నూతన జిల్లా కలెక్టరేట్ ఆవిర్భావం జరిగిందని ఆయన తెలిపారు. అడవితల్లిబాట కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం వెయ్యికోట్లు మంజూరు చేసిందని తెలిపారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా పివిటిజి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 1,570 సెల్ టవర్లు మంజూరయ్యాయని, జూలై నెలాఖరుకు పూర్తి నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్. బొజ్జిరెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన బాధితులు కొంతమందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాలేదని బాధితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలన్నారు. ఈ జిల్లాను అభివృద్ధి చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ఈరోజు చరిత్రలో గుర్తుపెట్టుకునే రోజు అని, ఎందుకంటే దేశంలో ఒక నియోజకవర్గానికి ఒక జిల్లా ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి అన్నారు. నూతన జిల్లాకు పక్కా భవనాలు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. నూతన జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబురమేష్, వంతల రాజేశ్వరి, గిరిజన సంఘ నాయకులు కంగల శ్రీనివాసరావు, వెదుళ్ళ లచ్చిరెడ్డి తదితరులు మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులను వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. డిఎడ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం ఆకట్టుకుంది.

కార్యక్రమంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, బేబీ అచ్యుత, సర్పంచ్ మంగ బొజ్జయ్య, మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కూటమి నాయకులు శ్రీనివాసరావు, కె.లక్ష్మి, ఎంపిటిసి లక్ష్మి, సర్పంచ్ దేవి, ప్రభుత్వ అధికారులు, పలువురు గిరిజన సంఘ నాయకులు, టిడిపి సీనియర్ నేత అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీగా అమిత్‌బర్దర్ బాధ్యతలు

రంపచోడవరం పిఎంఆర్‌సి దగ్గర ఎస్‌పి అమిత్‌బర్దర్ పోలవరం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అల్లూరిసీతారామరాజు జిల్లా ఎస్పీగా ఆయన ఉన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి సాయిప్రశాంత్, పలు మండలాలకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి కేలండర్, డైరీలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అరకులోయ:ప్రజాశక్తి దినపత్రిక 2026 కేలండర్ అద్భుతంగా ఉందని అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు అన్నారు. బుధవారం స్థానిక మహిళ డిగ్రీ కళాశాలలో అరకు ప్రజాశక్తి విలేఖరి డి గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ చలపతిరావుతోపాటు, అధ్యాపకులు బృందం ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రజాశక్తి క్యాలెండర్ అద్భుతంగా రూపొందించి పాఠకులకు, ప్రకటన కర్తలకు అందిస్తుందని ఆయన అన్నారు. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న ప్రజాశక్తి దినపత్రిక అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెంది ప్రజలకు, కార్మికులకు, కర్షకులకు, ఉద్యోగులకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఒడిదుడుకులు వచ్చిన నిలబడేది ప్రజాశక్తి దినపత్రిక అని ఆయన అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రజలకు ఒక దిక్సూచి అని ఆయన అన్నారు.

కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు.

నిలిచిన రోడ్డు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో అడవి తల్లి బాట కింద మంజూరైన సుమారు 2. కోట్ల 20 లక్షల తో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డు నుండి బెడ్డగూడ మీదుగా రాజుపాక గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్లు మేర ఎత్తు వర్క్, కల్వర్టు వంటి పనులకు బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో నిలిచి పోయాయి. దీంతో రోడ్డుంతా అస్తవ్యస్తంగా మారింది. బెడ్డగుడ, రాజుపాక, డెక్కపూరం, పపట్కదొవడ. తదితర గ్రామాలకు చెందిన ఆదివాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించి రోడ్డు పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న రహదారి

ప్రకృతి పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి డుంబ్రిగుడ:సుస్థిర జీవనోపాధికి సీసీఎఫ్ ప్రోత్సాహం అందిస్తుందని ఆ సంస్థ ప్రోగ్రాం అధికారి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని తూటంగి, లాసేరు దాతూరు, జర్రాయి, బల్లగెడ్డ, బుడ్డింగి, దూబరాయి, బల్లకట్టు గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి పద్ధతులతోపాటు సేంద్రియ ఎరువుల తయారీ నిర్వాహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రకృతి సహజ సిద్ధ పద్ధతులతో కషాయల వాడకంతో పంటల దిగుబడి సాధ్యడతాయని ఆయన అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు ఎం శశికుమార్, కమల, లక్ష్మీ, మాలతి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- అనంతగిరి: ఉద్యోగం ఇప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పి రెండు సంవత్సరాలు క్రితం తమ కుమార్తెను అపహరించిన గిరిజనేతురుడు పై తల్లిదండ్రులు బుధవారం పోలీస్ ఫిర్యాదు చేశారు. మండలంలోని నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయతీ సింగవరం గ్రామానికి చెందిన .పోలన్న దొర తమ కుమార్తెను అప్పగించి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ కుమార్తె సబ్బుకు నాగమణికి అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన కల్వపల్లి. రమేష్ ప్రస్తుతం గాజువాకలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. 2024లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ తమ కుమార్తెను తీసుకువెళ్లాడని, నేటికీ జాడ తెలియలేదన్నారు. కుమార్తెను అప్పగించాలని ఫోన్లు చేసినప్పటికీ ఉద్యోగం చేస్తుందని, మాయమాటలు చెప్పి జాడ తెలియకుండా చేశాడన్నారు. తక్షణమే రమేష్ పై కఠిన చర్యలు తీసుకొని తమ కుమార్తెను అప్పగించాలని తండ్రి కోరారు.

అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పై పీడీ యాక్ట్ పెట్టి, అన్యాయంగా అరెస్టు చేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మైలపల్లి మహేష్ బాబు అన్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ బుధవారం 9వ రోజు మత్స్యకారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం అలు పెరుగని పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడిపై పీడీ యాక్ట్ పెట్టి నిర్బంధించడం పచ్చి దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడా కాశీరావు, వై.చిట్టియ్య, పి.కన్నయ్యమ్మ, బి.నూకలమ్మ, బి.పార్వతి, వై.జగమని, డి.నూకమ్మ వై.కోర్లయమ్మ,పి.కాంతం, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగే వరకూ పోరాటం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు

మాట్లాడుతున్న మేకలనాగేశ్వరరావు

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని శ్రీ మర్త శ్రీరామ్మూర్తి భవన్‌లో సిపిఎం మండల కమిటీ సమావేశం ఆవుల ఉపేంద్ర అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ మండలంలో ప్రతి నిర్వాసితుడికీ న్యాయం జరిగే వరకూ సిపిఎం పోరాడుతుందన్నారు. మండలంలో 48 గ్రామాలకు 9 గ్రామాలను మాత్రమే ముంపు గ్రామాలుగా గుర్తించడం జరిగిందని, ప్రతీ గ్రామానికి న్యాయం చేయాలన్నారు. కొన్నిచోట్ల అనర్హులను అర్హులుగా గుర్తించారని దానివల్ల వాస్తవమైన అర్హులు నష్టపోతున్నార న్నారు. ఇచ్చిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నివాసయోగ్యంగా లేదని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ప్యాకేజీ ఇవ్వాలని, లేకుంటే రానున్న కాలంలో నిర్వాసితుల తరపున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఆవుల మురళి, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, ఎంపిటిసి జయసుధ, కర్నాటి శ్రీనివాసరావు, మడెం బాబు, తెల్లం తమ్మయ్య, కొండా ఈశ్వర్లు, ఎంపిటిసి జయసుధ, ఊయక కన్నయ్య, గుండం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ తవ్వకాలు అడ్డుకుంటాం

తీర్మానించిన అసరాడ - కొట్నపల్లి గ్రామస్తులు

క్వారీ వ్యతిరేకిస్తూ తీర్మానం చేసుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- జికెవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ, అసరాడ –కొట్నపల్లి (దేవరపల్లి పంచాయతీ) గ్రామాల మధ్య అన్‌రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో 5 హెక్టార్ల భూమిని లీజుకు తీసుకుని నల్లరాయి క్వారీ తవ్వకాల అనుమతుల కోసం కాంట్రాక్టుదారులు తమను సంప్రదించారని ఆయా గ్రామస్తులు తెలిపారు. దీనికి సంబంధించి అసరాడలో గ్రామస్తులంతా మంగళవారం రాత్రి సమావేశమై తామంతా క్వారీ తవ్వకాలకు వ్యతిరేకమని తీర్మానం చేశారు. ఉపసర్పంచ్ సోమేష్‌కుమార్, వార్డు సభ్యులు కాసులమ్మ, పెసా గ్రామకమిటీ సభ్యులు సింహాచలం, సోమరాజు,రాజేష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ క్వారీ అనుమతు లను అడ్డుకుంటామన్నారు. క్వారీ తవ్వకాలు చేపట్టే ప్రాంతం తమ గ్రామాలకు సమీపంలో ఉందని, తవ్వకాలు చేపడితే అనారోగ్యానికి గురవడంతో పాటు మూగజీవాలు కూడా మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కూడా నష్టపోతామన్నారు. అనంతరం ఉప సర్పంచ్ సోమేష్‌కుమార్ మాట్లాడుతూ నల్లరాయి క్వారీ తవ్వకాల వల్ల గ్రామాలకు, ప్రజలకు ప్రయోజనాలు కంటే అనర్థాలే ఎక్కువన్నారు. స్థానిక వార్డు సభ్యులు కాసులమ్మ, పెసా గ్రామ కమిటీ సభ్యులు సింహాచలం, సోమరాజు,రాజేష్ కుమార్,మాజీ ఎంపీటీసీ సభ్యులు కాంతమ్మ, వైసీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు నారాయణ,గ్రామ పెద్దలు లింగమూర్తి రామారావు, సత్యనారాయణ రామన్నపడాల్, హేమంత్, భానుప్రకాష్ (మాస్టర్), మురళి, ఉపేంద్ర, మహిళలు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ కృషి

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు అన్నారు. సున్నంవారిగూడెంలో యుటిఎఫ్ డైరీని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిస్కారం కావాలంటే ప్రతి ఉద్యోగి చేతిలో యూటీ యఫ్ డైరీ ఉండాలనీ, ఉద్యోగుల దైనందిన సమస్యల పరిస్కారానికి డైరీ ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. యూ. టీ. యఫ్ డైరీ లో సమాజానికి ఉపయోగపడే అతి ముఖ్యమైన సమాచారం పొందుపర్చడం జరిగిందనీ, అందుకు ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సుబ్బారావు, ఎం. భీష్మారావు, సి. హెచ్. అప్పారావు, కె. సోమరాజు, ఎస్. వీర్రాజు, టీ. సత్తిబాబు, కె. నాగార్జున్, ఎస్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఎఒ చక్రధర్

ఎమ్ఆర్‌పి ధరకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖాధికారి చక్రధర్ బుధవారం తెలిపారు. మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఎరువులను, పురుగు మందులను ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి తప్ప అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రైవేట్ డీలర్స్, సొసైటీలో జడ్డంగి రైతుసేవ కేంద్రంలో కలిపి 180 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

యుటిఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: స్థానిక మండల కేంద్రంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం 2026 క్యాలెండర్, డైరీలను బుధవారం విద్య సాగర్, మండల విద్యాశాఖ అధికారులు సుందర్‌రావు, గేన్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముద్రించిన క్యాలెండర్, డైరీలు చాలా ఆకర్షణంగా ఉందని చెప్పారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై పోరాటం సాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు కే రఘునాథ్, కార్యదర్శి ఎస్ కన్నయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ బాలకృష్ణ, రాజారావు, జిల్లా కౌన్సిలర్ టి సుబ్బారావు, జి దుక్కు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్

సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : కార్మికుల చట్ట బద్ద హక్కుల రక్షణ కోసం ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం భాగస్వాములు కావాలని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ పిలుపునిచ్చారు. 'లేబర్ కోడ్లు, భారతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రభావం' అనే అంశంపై బుధవారం పౌర గ్రంథాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అమర్జీత్‌కౌర్ హాజరై మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లు అమలుతో భారతీయ శ్రామిక వర్గం బ్రిటిషు కాలం నాటి బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన నిలబడి పోరాడిన భారతీయ కార్మిక వర్గం స్వాతంత్ర్యానికి ముందే 8 గంటల పని దినం, సంఘం పెట్టుకునే హక్కు, వేతన చట్టం, బోనస్ చట్టం పారిశ్రామిక వివాదాల చట్టం, బొగ్గు గనుల చట్టం, సమ్మె హక్కు తదితర చట్టాలు సాధించుకుంటే వీటన్నిటిని కోడ్‌ల రూపంలో మార్పు చేసి మోడీ ఉత్తర్వులు ఇవ్వడం కార్పొరేట్లకు, కార్మికవర్గాన్ని తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. వేతన కోడ్ ద్వారా గతంలో ఉన్న వేతన బోర్డులకు కాలం చెల్లినట్టేనని, జీతాలు ఎగవేసే యజమానులను నిలదీసే అధికారం లేబర్ కమిషనర్‌కు లేకుండా మార్పు చేశారని తెలిపారు. సోషల్ సెక్యూరిటీ కోడ్ వల్ల కార్మికులు సాధించుకున్న సంక్షేమ బోర్డులు, పథకాలు రద్దుచేశారని, 40 శాతం కార్మిక వర్గాన్ని ఇఎస్ఐ, పిఎఫ్ పథకాలకు దూరం చేశారని, కార్మికులు సమ్మె చేయాలంటే 50 శాతం ఆమోదం ఉండాలని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మికుల శ్రమ ద్వారా వచ్చే ఆదాయం దేశ సంపదను ప్రపంచ మార్కెట్లో అగ్రభాగాన నిలబెట్టిందన్నారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖ స్టీల్‌ప్లాంటు, భారతీయ వాయు రంగం, బొగ్గు, చమురు, విద్యుత్, రంగాలు అన్ని అదానికి కట్టబెడితే దేశం మళ్లీ ఈస్ట్ ఇండియా బనియా చేతుల్లోకి, కార్మికులు బానిసత్వంలోకి నెట్టివేయబడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుకు వెళితే దాని ప్రభావం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయంపై తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు, రక్షణ రంగాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జిఎస్‌జె.అచ్యుతరావు, బిసిహెచ్.మసెన్, డి.ఆదినారాయణ, పడాల రమణ, మన్మధరావు, బూసి వెంకటరావు, కె.సత్యాంజనేయ, వామనమూర్తి, చంద్రశేఖర్, కాశిరెడ్డి సత్యనారాయణ, పదాల గోవింద్, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

పలు చోట్ల పింఛన్ల పంపిణీ

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: పేద గిరిజన కుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆసరాగా నిలుస్తుందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు అన్నారు. పోతంగి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటికి పంపిణీ చేశారు. పనసపుట్టు మోడల్ కాలనీలో అరకు పార్లమెంట్ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ టి డి పి కమిటీ అధ్యక్షుడు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మాడగడ పంచాయతీ పరిధిలోని బోసుబెడ గ్రామంలో టీడీపీ నేత, వార్డు సభ్యులు వంతల డేవిడ్ బుధవారం పింఛన్లు అందజేశారు.

హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీతో పాటు పరిసర గ్రామాల్లో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శతక బొంజు బాబు, పార్టీ కోట్నాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబె బాబురావు, బీజేపీ ఎంపిటిసి సాంబె బాలకృష్ణ, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కూడేలి నూకరాజు, ఏఎంసీ డైరెక్టర్ ఏడే చిట్టిబాబు పాల్గొన్నారు.

అనంతగిరి: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్ అన్నారు మండలంలోని టోకూరు పంచాయతీలో గ్రామంలో పింఛన్ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు నరేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: సామాజికంగా చితికిపోయిన వారికి ఆర్థికభరోసా కల్పించే ఉద్దేశ్యంతో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం బోర్నగూడెంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గా ఆమె మాట్లాడుతూ, అర్హులైన వారికి త్వరలో కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, రంపచోడవరం మాజీ సర్పంచ్ నిరంజని దేవి, ఎంపిడిఒ ప్రసాద్, కడబాల గణపతి, గ్రామ కమిటీ అధ్యక్షులు కొండపల్లి వెంకటలక్ష్మి అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి : జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొలియ్యం బాలరాజు ఆధ్వర్యంలో రింతాడ పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సింహాచలం వెటర్నరీ అసిస్టెంట్ శశికాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండలంలో బుధవారం ఎంపిడిఒ ఇమ్మాన్యుయేల్ లబ్దిదారులకు పింఛన్లు అందించారు. అర్హులైన వారికి త్వరలో కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యదర్శులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో పింఛను ఇస్తున జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

4న బహిరంగ సభను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా నాయకుడు సన్నిబాబు

సమావేశంలో మాట్లాడుతున్న సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : విశాఖ వేదికగా బుధవారం ప్రారంభమైన సిఐటియు అఖిలభారత మహాసభలో భాగంగా ఈనెల 4న ఆదివారం విశాఖలో నిర్వహించే మహాకార్మిక ప్రదర్శన, బహిరంగసభను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు బొండా సన్నిబాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంగన్వాడీల సమావేశంలో మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను కాలరాసి నాలుగు లేబర్‌కోడ్‌లను బలవంతంగా రుద్ది కార్మిక హక్కులను కాలరాయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. కార్మికులను యాజమాన్యాలను కట్టుబానిసలను చేయాలనే ప్రభుత్వం కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రైవేటీకరణతో ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, పనిగంటల పెంపుతో కార్మికులపై పనిభారం, అంగన్వాడీలు వంటి స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగభద్రత, ఇతర సౌకర్యాల కల్పనలో పాలక ప్రభుత్వాలు మొండిచేయి చూపుతున్నాయన్నారు. దీనిపై సిఐటియు జాతీయమహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు మార్గనిర్దేశనం చేస్తారన్నారు ఈ నేపథ్యంలో ఈనెల 4న విశాఖలో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగసభలో అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్నభోజనం ఇతర అన్ని వర్గాలకార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు బైకిస్ట్‌ల దుర్మరణం

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : బస్సు ఢీకొనడంతో బైకిస్ట్ దుర్మరణం పాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. మునగపాక గ్రామానికి చెందిన మొల్లేటి రాము (24) అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లోని సోలార ఫార్మా పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బి షిఫ్ట్ విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా వెళుతుండగా కొండకర్ల సమీపంలో లారాస్ 2 సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, రాము ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాము పైనుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఫార్మా బస్ ఢీకొనడంతో మృతి చెందిన మొల్లేటి రాము కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము డిమాండ్ చేశారు.

కుంపల్లి కూడలిలో మరొకరు...

దేవరాపల్లి : విశాఖపట్నం వెళ్లే మార్గంలో కుంపల్లి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కె.ఎం.పాలెం గ్రామానికి చెందిన చౌడువాడ దేముడునాయుడు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న అదే గ్రామానికి చెందిన గందం మహేష్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. దీనిపై మృతుని కుటుంబీకులు, ఆర్టీసీ కండక్టరు రమణమ్మ చెప్పిన వివరాలివి. కృష్ణయుడు పేట జంక్షన్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న 12డి బస్సు కుంపల్లి కూడలికి చేరుకునే సమయంలో ద్విచక్ర వాహనం వస్తున్న ఇద్దరు యువకులు బస్సు తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న దేముడునాయుడు తలకు బలమైన గాయం తగలడంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. సముద్రంనాయుడు, రమణమ్మ దంపతుల రెండో కుమారుడైన దేముడునాయుడు ఇంటర్ పూర్తి చేసిన తరువాత తల్లిదండ్రులతో పాటు తన అన్నయ్య జగ్గారావుకి వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. స్నేహితుడితో వెళ్లి వస్తానని చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి మహేష్ తో ద్విచక్ర వాహనంపై బయలుదేరిన కొడుకు అంతలోనే శాశ్వతంగా తమకు దూరమయ్యాడనే వార్త చెవిన పడిన అతని తల్లిదండ్రులు బోరున విలపించారు. తమ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందడంతో కెఎం.పాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పులిహోర ప్రసాదం దుష్ప్రచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- వేపగుంట : సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు అందజేసే పులిహోర ప్రసాదంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, దురుద్దేశపూర్వకమని దేవస్థాన అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. పులిహోర తయారీలో వాడే మిర్చి, ఆవాలు, శనగపప్పు తదితరాలను అత్యంత జాగ్రత్తగా శుభ్రపరిచిన తర్వాతే వినియోగిస్తారని తెలిపారు. తయారీ, ప్యాకింగ్ చేసేటప్పుడు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాగా వేడి చేసిన తర్వాత తయారయ్యే పులిహోరలో పురుగు సజీవంగా ఉండే అవకాశం లేదని వివరించారు. ప్రసాదం ప్యాకెట్ కొనుగోలు చేసిన తర్వాత బయటకు వెళ్లి, కొంత సమయం తర్వాత తిరిగి వచ్చి పురుగు ఉందని చూపించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

100రోజుల ప్రణాళిక అమలు చేయాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: పదో తరగతిలో లక్ష్యాలను చేరుకోవడానికి ఉపాధ్యాయులు పక్కగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేసే విధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తుర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో యాక్షన్ ప్లాన్‌తో జరుగుతున్న అధనపు తరగతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో శతశాతం ఉతీర్ణతకు యాజమాన్యం కృషి చేయాలని ఆదేశించారు.మండల విద్యాశాఖ అధికారులు సుందర్రావు, గెన్ను పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-జికేవీధి: రింతాడ పంచాయతీలో అన్ని గ్రామాల్లో సంక్రాంతి వరకూ స్పెషల్ శానిటేషన్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోం దని పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ అన్నారు. గ్రామాల్లో ఎప్పటి కప్పుడు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో జికె వీధి, మొండిగడ్డ, వంచుల, దేవరపల్లి, లక్కవరపుపేట పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కంకిపాటి సత్తిబాబు, గ్రామస్తులు, క్లాప్‌మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

పులి అప్పారావు దంపతులను సన్మానిస్తున్న డిఇఒ, ఎంఇఒలు

'అంకితభావంతో సేవలందించడం ముదావహం'

ప్రజాశక్తి-అడ్డతీగల: డొక్కాపాలెం జిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పులి అప్పారావు దంపతులను ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం డిఇఒ మల్లేశ్వరరావు, ఎంఇఒలు ఆయనను ఘనంగా సన్మానించారు. అడ్డతీగల మండలం లో 37 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుని అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. రంపచోడవరం డైట్ ప్రిన్సిపాల్ ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు, ఏలేశ్వరం ఎంఇఒ అబ్బాయి, అడ్డతీగల మండలం ఎంఇఒ -1 రమేష్, ఎంఇఒ- 2 శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్‌లో భాగంగా గౌరవాధ్యక్షులు కుశల, అధ్యక్షులు గాంధీరెడ్డి, సహాధ్యక్షుడు వేమ బాలరాజు, సహాధ్యక్షురాలు జెవి రమణమ్మ ప్రధాన కార్యదర్శి రాఘవులు, కోశాధికారి జగదీష్, ప్రత్యేకకార్యదర్శి అబ్బాయిరెడ్డి కార్యదర్శి చిన్నారావు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిమాపక వాహనం, రోడ్ స్వీపింగ్ మెషిన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, అగ్నిమాపక కేంద్రంలో నూతనంగా సమకూర్చుకున్న రోడ్ స్వీపింగ్ మెషిన్, మల్టీపర్పస్ ఫైర్ టెండర్‌ను బుధవారం పోర్ట్ డిప్యూటీ చైర్ పర్సన్ రోష్ని అపరాంజి కొరాటి ప్రారంభించారు. రూ.3.85 కోట్ల వ్యయంతో సమకూర్చుకున్న మల్టీపర్పస్ ఫైర్ టెండర్‌లో 6 కిలోలీటర్ల నీటి ట్యాంక్, 200 లీటర్ల ఫోమ్ కంపౌండ్, 100 కిలోల డ్రై కెమికల్ పౌడర్ (డీసీపీ), 45 కిలోల కార్బన్ డయాక్సైడ్‌తో పాటు అత్యవసర పరిస్థితుల కోసం అవసరమైన ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. రోడ్ స్వీపింగ్ మెషిన్‌ను పోర్ట్ పరిధిలోని అంతర్గత రహదారులపై ఏర్పడే దుమ్ము, చెత్త, స్పిల్లేజ్ తదితరాలను శుభ్రం చేయడానికి వినియోగించనున్నారు. రూ.4.69 కోట్ల వ్యయంతో ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో అరుణ్ ప్రసాద్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, పోర్ట్ విభాగాధిపతులు సీనియర్ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఎపి ఆదివాసీ జెఎసి డిమాండ్

సత్యగ్రహయాత్ర నిర్వహిస్తున్న ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు

ప్రజాశక్తి-దేవీపట్నం: మండల పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని, ఎపి ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావుదొర డిమాండ్ చేశారు. ఎపి ఆదివాసీ జేఏసీ ఆదివాసీ దేవీపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాగిన ఆదివాసీ సత్యగ్రహయాత్రలో ఎపి ఆదివాసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లంశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కారంరామన్నదొర, మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, మడకం బంగారుబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చిన హామీ ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం చెయ్యాలని, 2025 మెగా డిఎస్‌సిలో రాజ్యాంగ విరుద్ధంగా నియమించిన గిరిజనేతర ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు పంపించాలని, వారి స్థానంలో స్థానిక ఆదివాసీ పట్టాభద్రులతో భర్తీ చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలనా సౌలభ్యం రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లాలో పోలవరం షెడ్యూల్డ్ ప్రాంతాన్ని చేర్చి జిల్లాకు కారం తమన్నదొర పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పై మూడు ప్రధాన డిమాండ్లతో నవంబర్ 9 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చేపట్టిన ఆదివాసీ సత్యగ్రహయాత్ర పోలవరం ప్రాంతాలలో పర్యటించి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం సమగ్ర పునరావాసం కల్పించి సమస్యలు పరిష్కరించాలని రామారావుదొర డిమాండ్ చేశారు. మండలంలోని డి.రావిలంక, పరగసానిపాడు, బోడిగూడెం, గుబ్బలంపాలెం, చిన్నరమణయ్యపేట, కోయలవీరవరం, నేలకోట, గొందూరు, నాగళ్ళపల్లి, సీతారాం, మూలపాడు, దండంగి, గంగంపాలెం, మంటూరు ఆర్అండ్ఆర్ కాలనీ, చిన్నారి గండి ఆర్అండ్ఆర్ కాలనీ మూలమెట్ట, మెట్టవీధి, పెనికిలపాడు పునరావస కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్లు, త్రాగునీరు, ఎంపిపి పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలని, పోతవరం మెయిన్‌రోడ్డు నుంచి ఆర్అండ్ ఆర్ కాలనీ వరకూ తారురోడ్డు మొదలైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2021లో పునరావాస కాలనీలకు తరలించి మౌలిక సదుపాయా లు కల్పించలేదన్నారు. అక్కడి సుద్ధనీటిని తాగలేక ఐదారు కిలోమీటర్లు వెళ్లి 25 రూపాయలు చెల్లించి మంచినీళ్లు కొని తెచ్చుకుంటున్నారన్నారు. సత్యసాయి వాటర్ ట్యాంకులు నిర్మించి మంచినీటిని అందించాలన్నారు. అన్ని సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం నమ్మించి ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలించి ఆదివాసీలను తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. భూమికి భూమి ఇస్తామని భ్రమలు పెట్టి ఇచ్చిన భూమికి పట్టాలు ఇవ్వలేదని, ఇచ్చిన పట్టాలకు భూములు చూపించలేదని ప్రతి నిర్వాసిత కాలనీలో ఈ సమస్య ఉందన్నారు. అలాగే తరలించిన గ్రామాల్లో బతుకుతెరువు లేక 30 నుండి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కూలి పనులకు సీతానగరం, రాజమండ్రి, కడియం వంటి మైదాన ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. చిన్నారిగండి ఆర్అండ్ఆర్ కాలనీ, పెనికిలపాడులో పర్యటించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించుకుంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

జిటిడబ్ల్యూ బాలికల వసతిగృహంలో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- జికె వీధి : అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు, జికె వీధి పిహెచ్‌సి రింతాడ సబ్ సెంటర్ పరిధిలో జిటిడబ్ల్యూ బాలికల వసతి గృహంలో డాక్టర్ బుష్రశ్రీ, డాక్టర్ శివరామ్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 71 మంది విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి సికిల్‌సెల్ ఎనీమియాగా గుర్తించి మెరుగైన వైద్యపరీక్షల కోసం పాడేరు వెళ్లాలని సూచించారు. అనంతరం హాస్టల్, కిచెన్, వాష్‌రూమ్స్, తరగతి గదులు తనిఖీ చేసి, వంటగదిలో నీరు నిల్వ లేకుండా, ఎటువంటి చెత్త లేకుండా చూడాలని వంటపాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు ఇవ్వాలన్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి గురువారం విద్యార్థులంతా ఐరన్‌మాత్రలు వేసుకోవాలని దానివల్ల రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జికెవీధి హెచ్‌వి ఎర్రయమ్మ , ఎంఎల్‌హెచ్ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెచ్‌ఎం సుమిత్ర , వార్డెన్ గంగాభవాని ఉన్నారు.

సింహాచలం ప్రసాదంలో నత్తపై ప్రశ్నిస్తే కేసులా?

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: సింహాచలం లక్ష్మీనరసింహ స్వామివారి పులిహోర ప్రసాదంలో నత్త రావడంపై ప్రశ్నించిన భక్తులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం అత్యంత దారుణమని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు అన్నారు. బుధవారం ఆయన వైసిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ భక్తులను తప్పుడు కేసులతో భయపెట్టడం, ఫిర్యాదు చేసినవారిపైనే కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో రాష్ట్రంలో ఇప్పటికే అన్ని ప్రధాన వ్యవస్థలు నిర్వీర్యం కాగా, ఆలయాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు.

రూ.120 కోట్లతో పూర్ణా మార్కెట్ అభివృద్ధి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో వేరుగాంచిన పూర్ణా మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో, దానిని తొలగించి రూ.120 కోట్లతో ఆధునిక మార్కెట్‌ను నిర్మిస్తామని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జనసేన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో ఉన్న అన్ని మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 18 నెలల కాలంలో రూ.50 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. నియోజవర్గంలో రూ.6 కోట్లతో నైట్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు శివ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టోయింగ్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో సమకూరిన అత్యాధునిక టోయింగ్ వాహనాన్ని బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ఒకటే స్పీడ్ లేజర్ గన్ అందుబాటులో ఉందని, ప్రమాదాల నివారణకు మరిన్ని పరికరాలు అవసరమని పేర్కొన్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తక్షణమే స్పందిస్తూ, త్వరలోనే మరో 3 స్పీడ్ లేజర్ గన్‌లను అందజేస్తామని హామీ ఇచ్చారు.

వాహనాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

వాల్తేరు రైల్వే డివిజన్‌లో రికార్డు స్థాయి వృద్ధి

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ : భారతీయ రైల్వేలో కీలకమైన వాల్తేరు డివిజన్ 2025వ సంవత్సరంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆదాయం, ప్రయాణికుల సౌకర్యాలు భద్రత వంటి అన్ని రంగాల్లో అసాధారణ వృద్ధిని కనబర్చినట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన 2025 ఏడాది పనితీరును సమీక్షిస్తూ ఈ మైలురాళ్లను వెల్లడించారు. వాల్తేరు డివిజన్ ఈ ఏడాది భారతీయ రైల్వేలో 5వ అత్యధిక ఆదాయం ఆర్జించిన డివిజన్‌గా, 5వ అత్యధిక లోడింగ్ సాధించిన డివిజన్‌గా నిలిచింది. నవంబర్ నాటికే రూ.9,030 కోట్ల ఆదాయాన్ని 73.5 మిలియన్ టన్నుల లోడింగ్‌ను సాధించడం విశేషం. కేవలం 256 రోజుల్లోనే 100 మిలియన్ టన్నుల లోడింగ్ మార్కును దాటి డివిజన్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పింది. ప్రయాణికుల ప్రయాణాన్ని మరింత సుఖమయం చేసేందుకు వాల్తేరు డివిజన్ అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. రౌండ్ ట్రిప్ ప్యాకేజీ స్కీమ్ ద్వారా ప్రయాణికులకు 20శాతం రాయితీ కల్పించారు. రాయగడను భారతీయ రైల్వేలో 70వ డివిజన్‌గా ఏర్పాటు చేయడం ఈ ఏడాది అతిపెద్ద మైలురాయి. దీనితో పాటు సుమారు రూ.1,200 కోట్ల వ్యయంతో నాలుగో లైన్లు, ఫ్లైఓవర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్ల ఆధునీకరణ పనులు చేపట్టారు. 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద 15 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో జివిఎంసి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహావిశాఖపట్నం నగరపాలక సంస్థ 2025 ఏడాదిలో సాధించిన విజయాలను మననం చేసుకుంటూ, 2026 నూతన సంవత్సరంలోకి సరికొత్త లక్ష్యాలతో అడుగుపెడుతోందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసీ కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ఆయన ఏడాది కాలపు ప్రగతి నివేదికను విడుదల చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రజలకు సేవలను మరింత వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీని 8 జోన్ల నుండి 10 జోన్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.657.39 కోట్ల అంచనాలతో 1667 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏడీబీ నిధులు రూ.447.62 కోట్లతో చేపట్టిన 24X7 మంచినీటి సరఫరా ప్రాజెక్టు 75 శాతం పూర్తయిందని తెలిపారు. ఆక్రమణలకు గురైన 17 పార్కు స్థలాలను స్వాధీనం చేసుకుని, 330 ఆస్తులకు ఫెన్సింగ్ వేసినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం గాజువాక, మధురవాడ ప్రాంతాల్లో రూ. 172 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. జాతీయ స్థాయిలో 'సఫాయిమిత్ర సురక్షిత్ షహర్' విభాగంలో విశాఖకు ప్రథమ స్థానం దక్కిందని చెప్పారు. పిఆర్ఎస్ఐ జాతీయ అవార్డులు, చైల్డ్ కేర్, సోషల్ మీడియా వినియోగం, మహిళా సాధికారత విభాగాల్లో మూడు జాతీయ అవార్డులను జీవీఎంసీ కైవసం చేసుకుందని వెల్లడించారు.

పోక్సో కేసుల నివారణకు సమన్వయ చర్యలు అవసరం

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో పోక్సో కేసులు తగ్గించాలంటే అన్ని శాఖలు మహిళా, శిశు సంక్షేమ శాఖతో సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఆశించిన మేర ఫలితాలు సాధించగలమని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో చట్టం - 2012) అమలు, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోక్సో కేసుల త్వరిత పరిష్కారానికి పోలీసు, వైద్యశాఖల సమన్వయం కీలకమన్నారు. దర్యాప్తు ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు కచ్చితమైన, సమయానుకూల ఫోరెన్సిక్ నివేదికలను వైద్య శాఖ అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పాఠశాలలు, గ్రామస్థాయిలో పిల్లలకు పోక్సోచట్టంపై అవగాహన కల్పించాలన్నారు. జిఒ 28 ప్రకారం పోక్సో బాధితులకు పరిహారం మంజూరు చేస్తున్నామని, కౌన్సెలింగ్, వైద్యసేవలు అందిస్తున్నామని ఐసిడిఎస్ పిడి కెవి.రామలక్ష్మి ఈ సందర్భంగా వివరించారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ పోక్సో కేసుల వేగవంతమైన విచారణ కోసం జిల్లాలో అదనపు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవాది డి.అన్నయ్యబాబు, సైకాలజిస్ట్ డాక్టర్ నిత్య పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, పిల్లల రక్షణ, బాధితులకు మానసిక సహాయం అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.